క్లుప్తంగా

ప్రధాన రహదారిపై మురుగునీరు



లింగాపూర్ ప్రధాన రహదారిపై కమాన్ వద్ద నిలిచిన మురుగునీరు

నర్సాపూర్ రూరల్: మండలంలోని లింగాపూర్‌లో ప్రధాన రహదారిపై పారుతున్న మురుగు నీటితో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి చిరుజల్లులకు తోడు మురికి కాల్వల నీరు ప్రధాన రహదారిపై చేరడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా కాలినడకన వెళ్లే వారితో పాటు ద్విచక్ర వాహనదారులు ప్రయాణించలేకపోతున్నారు. పలుమార్లు గ్రామ పంచాయతీ కార్యదర్శికి విన్నవించినా.. పట్టించుకోవడం లేదని గ్రామస్తులు తెలిపారు.

అర్హులైన అందరికీ రైతు భరోసా

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో రైతు భరోసాపై అన్నదాతల అభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడి రైతులు సన్న చిన్నకారు 10 ఎకరాల లోపు అందరికీ రైతు భరోసా అందజేయాలని ఏకవాక్య తీర్మానం చేశారు. పీఏసీఎస్ చైర్మన్ మల్లేశంగౌడ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా డిప్యూటీ రిజిస్టర్ ప్రత్యేకాధికారిగా హాజరయ్యారు. మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో శ్వేతా కుమారి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మనోహర్, రైతుల పాల్గొన్నారు.

కనులపండువగా గట్టమ్మ, ముత్యాలమ్మ బండ్ల ఊరేగింపు



బండ్ల ఊరేగింపులో యువకులు

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని నవాబుపేట వీధిలోని గ్రామ దేవతలకు ఆదివారం భక్తులు బండ్లను ఊరేగించారు. ఇందులో భాగంగా గ్రామ దేవతలు గట్టమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్లకు ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అందంగా అలంకరించిన ఎడ్లబండ్లను అమ్మవార్ల ఆలయాల చుట్టూ ఊరేగించారు.

మన్‌కీ బాత్ వీక్షించిన బీజేపీ నాయకులు



మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): మూడోసారి ప్రధానిగా ఎన్నికైన నరేంద్రమోదీ నిర్వహించిన మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని నార్సింగి మండల బీజేపీ నాయకులు వీక్షించారు. ఆదివారం నార్సింగిలో ఒకచోట చేరిన బీజేపీ నాయకులు ప్రధాని మన్‌కీ బాత్ కార్యక్రమం చూశారు. ఇందులో బీజేపీ మండలాధ్యక్షుడు బాల్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు శిర్న చంద్రశేఖర్, నాయకులు లింగారెడ్డి, గురుపాదం ఉన్నారు.

వైభవంగా వేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవం

చేగుంట(తూప్రాన్): మండలంలోని కిష్టాపూర్ గ్రామంలోని వేణుగోపాల స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరకు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని దైవ దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వడ్ల నవీన్, సంద్రుగు శ్రీకాంత్, సతీష్, శ్రవణ్‌తో పాటు గ్రామ భక్తులు పాల్గొన్నారు.

ఆర్టీసీతోనే సురక్షిత ప్రయాణం

గజ్వేల్‌రూరల్: సురక్షితమైన ప్రయాణం ఆర్టీసీతోనే సాధ్యమవుతుందని సీఐ సైదా పేర్కొన్నారు. 'లక్ష్మీ లక్ష్యం' చాలెంజ్‌లో భాగంగా జీపీపీ డిపోలో ఏప్రిల్, మే నెలల్లో అధిక ఆదాయం తీసుకు వచ్చిన కండక్టర్, డ్రైవర్‌లతోపాటు వ్యాసరచన పోటీల్లో ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు డిపోలో శనివారం బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఆర్టీసీ బస్సులలో ప్రయాణించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరారు. కార్యక్రమంలో జీపీపీ డిపో మేనేజర్ సురేఖ, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ పాఠశాలలో చదివేదెలా?

- శిథిలావస్థలో రామాయంపేట జెడ్పీ స్కూల్
- భయాందోళనలో విద్యార్థులు, టీచర్లు
- తరచూ పెచ్చులూడుతున్న గదులు



స్లాబ్ కింది భాగం, గోడలు శిథిలమైన పాఠశాల గది

రామాయంపేట(మెదక్): మున్సిపాలిటీ పరిధిలోని మార్కెట్‌లో ఉన్న ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల భవనం పూర్తిగా శిథిలమై ప్రమాదకరంగా మారింది. ఈ భవనం ఏ క్షణాన కూలుతుందో తెలియని పరిస్థితుల్లో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోతే తమ పిల్లలను స్కూలుకు పంపించలేమని విద్యార్థుల తల్లిదండ్రులు తేల్చిచెప్పారు. వివరాల్లోకి వెళితే... రామాయంపేట ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు మొత్తం 129 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇందులో ఉన్న తొమ్మిది గదులు పూర్తిగా శిథిలమయ్యాయి. స్లాబ్ కింది భాగం పూర్తిగా దెబ్బతిని ఇనుప చువ్వలు తేలాయి. తరచూ స్లాబ్ సిమెంట్ పెచ్చులూడి పడుతుండటంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. చిన్నపాటి చినుకులు కురిసినా.. స్లాబ్ నుంచి ధారగా నీరు కురుస్తూ గదుల్లో నిలుస్తుంది. వర్షం పడితే ముందు జాగ్రత్తగా



శిథిలావస్థలో రామాయంపేట జెడ్పీ బాలుర స్కూల్

విద్యార్థులను ఇళ్లకు పంపిస్తున్నారు. శిథిలమైన ఈ భవనాన్ని మరమ్మతులు చేయిస్తామని గతంలో పలుమార్లు ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు ఇచ్చిన హామీలు నెరవేరలేదు. భవనం ప్రమాదకరంగా మారినందున తమ పిల్లలను పాఠశాలకు పంపించమని వారి తల్లిదండ్రులు అంటున్నారు. ఈ భవనానికి మరమ్మతులు చేయించినా.. ఫలితం ఉండదని, దీనిని పూర్తిగా నేలమట్టం చేసి ఇదే స్థలంలో కొత్త భవనం నిర్మించాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై మండల విద్యాధికారి నీలకంఠంను సంప్రదించగా.. భవనం మరమ్మతుల విషయమై పై అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, త్వరలో చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రైతు భరోసాపై అభిప్రాయాల సేకరణ

- జిల్లా సహకార అధికారి కరుణ

రామాయంపేట(మెదక్): ప్రభుత్వం చేపడుతున్న రైతు భరోసాపై రైతుల అభిప్రాయాలు ప్రభుత్వానికి నివేదిస్తామని జిల్లా సహకార అధికారి (డీసీవో) కరుణ పేర్కొన్నారు. ఆదివారం రామాయంపేటలో నిర్వహించిన రైతుల అభిప్రాయ సేకరణ కార్యక్రమానికి హాజరై, ఆమె మాట్లాడుతూ... రైతుల సూచనలు, అభిప్రాయాలు సేకరించాలని, ప్రభుత్వ ఆదేశాలతో వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు. ఇంతకుముందు ఉన్న ఈ పథకంలో ఏమైనా లోటుపాట్లు ఉన్నాయా? ఏమైనా మార్పులు అవసరమా? అనే విషయమై రైతులు తమ అభిప్రాయాలు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ చంద్రం, వైస్ చైర్మన్ సులోచన, సీఈవో నర్సింలు, మండల వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణ, రైతులు పాల్గొన్నారు.



రైతుల అభిప్రాయాలు సేకరిస్తున్న డీసీఓ కరుణ

సమస్యల పరిష్కారానికి కృషి



విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది

శివ్వంపేట(నర్సాపూర్): రెవెన్యూ పెండింగ్ సమస్యలు పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశాల మేరకు కృషి చేస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్‌చారి అన్నారు. ఆదివారం సెలవు దినం అయినప్పటికీ కార్యాలయ సిబ్బంది విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న వివిధ రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ధరణిలో కొత్తగా ఇచ్చిన ఆప్షన్లకు అనుగుణంగా పని చేస్తున్నట్లు చెప్పారు. శివ్వంపేట తహసీల్దార్ కార్యాలయంలో 950 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా.. ఆదివారం వరకు 600 దరఖాస్తులు ఆన్‌లైన్ చేశామన్నారు. కలెక్టర్ ద్వారా పెండింగ్ సమస్యలు పరిష్కారం కానున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్ షఫీయొద్దీన్, ఆర్ఐ కిషన్, సిబ్బంది ఉన్నారు.

ఆస్పత్రిలో చిటుకువ్యాధి టీకా ఏదీ ?



కొడిపల్లిలోని పశువుల ఆస్పత్రి

కౌడిపల్లి(నర్సాపూర్): పశువుల ఆస్పత్రిలో చిటుకు వ్యాధి టీకాలు అందుబాటులో లేకపోవడంతో జీవాల పెంపకందారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో లేత గడ్డి మొలకెత్తుతోంది. దీంతో గొర్రెలకు చిటుకు వ్యాధి వచ్చే ప్రమాదం ఉంది. కాగా కౌడిపల్లి పశువైద్యశాలలో చిటుకు వ్యాధి నివారణ టీకాలు లేకపోవడంతో గొర్రెల పెంపకందారులు ఆందోళన చెందుతున్నారు. జూన్, జూలై నెలలో వర్షాలు కురయడం వల్ల మొలకెత్తిన లేతగడ్డిని మేయడంతో గొర్రెల్లో చిటుకు వ్యాధి సోకుతుంది. ఈ వ్యాధి ప్రాణాంతకం కావడంతో ప్రభుత్వం ఉచితంగా చిటుకువ్యాధి నివారణ టీకాలు ఇస్తుంది. కాగా ప్రస్తుతం కౌడిపల్లిలోని పశువుల ఆస్పత్రితో పాటు గ్రామాల్లోని పశువైద్యశాలలో వ్యాధి నిరోధక టీకాలు అందుబాటులో లేవు. దీంతో వ్యాధి సోకితే తమ పరిస్థితి ఏమిటని జీవాల పెంపకందారులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం త్వరగా పంపిణీ చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై మండల పశువైద్యాధికారి రాజును వివరణ కోరగా.. చిటుకు వ్యాధి నివారణకు మండలానికి 20 వాయిల్స్ రావడంతో పంపిణీ చేశామన్నారు. మరో 80 వాయిల్స్ అవసరం ఉందని జిల్లా అధికారులకు నివేదిక ఇచ్చామన్నారు. రాగానే అవసరం ఉన్న గ్రామాల్లో గొర్రెలకు టీకాలు ఇస్తామని చెప్పారు.

కరెంట్‌షాక్‌తో ఆవు మృతి



మృతి చెందిన ఆవు

కౌడిపల్లి(నర్సాపూర్): సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్త్‌వైర్ కరెంట్‌షాక్ తగలడంతో ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సంఘటన కౌడిపల్లి మండలం నాగ్సాన్‌పల్లిలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామస్తులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ అల్మయపేట ఎల్లంకు చెందిన పశువులను పశువుల కాపరి రోజు మాదిరిగా మేతకు తీసుకు వెళ్లి సాయంత్రం తిరిగి ఇంటికి కొట్టుకు వస్తున్నాడు. సాయంత్రం వర్షం పడింది. దీంతో గ్రామంలోని సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పక్కనుంచి వస్తున్న ఆవుకు ఎర్త్‌వైర్ కరెంట్‌షాక్ తగలడంతో అవు అక్కడికక్కడే మృతి చెందింది. ఇది గమనించిన కాపరి మిగతా పశువులకు అటుగా వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో మరింత ప్రమాదం తప్పింది. కాగా జెర్సీ ఆవు మృతి చెందడంతో సుమారు రూ. 50వేలు నష్టం జరిగిందని తెలిపారు.

నేడు శివ్వంపేటలో ప్రత్యేక సమావేశం

శివ్వంపేట(నర్సాపూర్): శివ్వంపేట ప్రాథమిక సహకార సంఘంలో సోమవారం ప్రత్యేక మహాజన సభ నిర్వహిస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి, వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి ఆదివారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని అమలు చేసే విషయంలో రైతుల అభిప్రాయాలు తెలుసుకునేందుకు ప్రత్యేక మహాజన సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సోమవారం ఉదయం 10–30 గంటలకు శివ్వంపేట ప్రాథమిక సహకార సంఘంలో జరిగే సమావేశానికి పీఏసీఎస్ డైరెక్టర్లతో పాటు రైతులు హాజరు కావాలని కోరారు.

రేగోడ్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా కిషన్

రేగోడ్(మెదక్): మండల కేంద్రం రేగోడ్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా మున్నూరు కిషన్ ఆదివారం ఎన్నికయ్యారు. కార్యదర్శిగా రాములు, కోశాధికారి గా మల్లప్ప ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు యాదగిరి మాట్లాడుతూ.. రేగోడ్ లయన్స్ క్లబ్ బృందం కొన్నేళ్లుగా సేవా కార్యక్రమాల్లో ముందుకు దూసుకుపోతుందని తెలిపారు. నూతన అధ్యక్షుడి ఆధ్వర్యంలో క్లబ్‌కు మంచి పేరు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నూతన కమిటీ బాధ్యులకు సలహాదారుడు ఎస్.దిగంబర్ రావు సన్మానించారు. కార్యక్రమంలో సంగమేశ్వర్, చోటుమియా తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు



చిలప్‌చెడ్(నర్సాపూర్): ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు



కౌడిపల్లి(నర్సాపూర్): తునికి నల్లపోచమ్మను దర్శించుకుంటున్న భక్తులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని చాముండేశ్వరి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం ఆలయంలోని బ్రహ్మి, కాళి, వైష్ణవి అమ్మవార్లను కూడా దర్శించుకొని, మొక్కులు సమర్పించుకున్నారని ఆలయ అర్చకులు తెలిపారు. అనంతరం అమ్మవారి ప్రసాదాన్ని భక్తులకు వితరణ చేశామన్నారు.

నల్లపోచమ్మ ఆలయంలో..

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్లపోచమ్మను భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగారావు, జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శివప్ప, రాజేశ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

సికింద్లాపూర్‌లో..

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో భక్తజన సందడి నెలకొంది. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పవిత్ర కోనేరులో



చందంపేట పెద్దమ్మ ఆలయంలో ..

స్నానమాచరించి కోనేరు పక్కనున్న లక్ష్మీనర్సింహస్వామితో పాటు గుట్టపై కొలువైన స్వామిని దర్శించుకున్నారు.

పెద్దమ్మతల్లికి ఒడిబియ్యం

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని చందంపేట గ్రామంలో వెలసిన పెద్దమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి ఒడిబియ్యం పోశారు. పురోహితులు దోర్బాల కాశీనాథశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష అలంకరణ, కుంకుమార్చన, అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు పెద్ద సంఖ్యలోని అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నర్సాపూర్: గురువులతో పూర్వ విద్యార్థులు



నర్సాపూర్‌రూరల్: రెడ్డిపల్లిలో..



వెల్దుర్తి ఉన్నత పాఠశాలలో..

నర్సాపూర్: పట్టణంలో 1984 సంవత్సరం పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు కలిసి పూర్వ విద్యార్థులు సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. సమ్మేళనంలో చత్రు నాయక్, చందన్‌రెడ్డి, నర్సింగ్‌రావు, రమేశ్, మైసాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్‌రూరల్: మండలంలోని రెడ్డిపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006 – 07వ సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థుల 20 ఏళ్ల తర్వాత ఒక్కచోట కలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యాబుద్దులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుకున్నప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, సత్యనారాయణ, రవీందర్ రెడ్డి, అనంతరెడ్డి, మాధవిలత, స్టూడెంట్స్ నరేష్ గౌడ్, నాగరాజు, శ్రీశైలం, నిర్మల, స్రవంతి, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి ఉన్నత పాఠశాలలో 1983–84 విద్యా సంవత్సరానికి చెందిన పదవ తరగతి విద్యార్థినీ, విద్యార్థులు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు. 41 ఏళ్ల తర్వాత అప్పటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పరమేశ్, రహీమ్, సుధాకర్‌రెడ్డి, పోతిరెడ్డి, భైరవదాస్, రమేశ్‌గౌడ్, భిక్షపతి పాల్గొన్నారు.

రేపు రైతుభరోసా అభిప్రాయంపై సమావేశం

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని సోమక్కపేట్ పీఏసీఎస్ ఆవరణలో మంగళవారం రైతుభరోసాపై అభిప్రాయంపై రైతులకు సమావేశం నిర్వహిస్తామని సొసైటీ వైస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి అన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు సమావేశానికి మండల రైతులు హాజరు కావాలన్నారు.

రామకోటికి భక్తిరత్న జాతీయ పురస్కారం



రామకోటి రామరాజును సన్మానిస్తున్న నాయకులు

గజ్వేల్‌రూరల్: పాతికేళ్లుగా గజ్వేల్‌తోపాటు పరిసర ప్రాంతాల్లో వేలాది మంది భక్తులచే కోట్లాది రామ నామాలను లిఖింపజేస్తూ ధార్మిక, సేవా రంగాల్లో విశేష కృషి చేస్తున్న రామకోటి రామరాజు భక్తిరత్న జాతీయ పురస్కారం అందుకున్నారు. ఆదివారం కరీంనగర్‌లో జరిగిన కార్యక్రమంలో తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో మాజీ ప్రధాని భారతరత్న పీవీ నర్సింహారావు జయంతి ఉత్సవాలలో భాగంగా తెలంగాణ ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, ఒడిసా, మహారాష్ట్రాల్లోని వివిధ రంగాల్లో సేవలందించిన పలువురికి తెలుగు వెలుగు భక్తిరత్న మహానంది జాతీయ పురస్కారంతో సత్కరించారు. అందులో భాగంగా రామకోటి భక్తసమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు సేవలను గుర్తించి వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు పోలోజు రాజ్‌కుమార్ మహానంది జాతీయ పురస్కారంతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద కోట్ల నుంచి 400 కోట్ల రామనాలను లిఖింపజేస్తూ వెయ్యి కోట్లకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రముఖ యూట్యూబ్ నటుడు సదానందం పాల్గొన్నారు.

జీవిత చరిత్రను ముద్రించాలి

గజ్వేల్‌రూరల్: మహనీయులైన మహాత్మ జ్యోతిరావుపూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ల జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో ముద్రించాలని అంబేడ్కర్ భవనం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అట్కూరి రాములు, మస్కూరి కిష్టయ్య కోరారు. అంబేడ్కర్ జ్ఞానమాల కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి ఆదివారం పూల మాలలు వేశారు. అనంతరం మాట్లాడుతూ జ్యోతిరావుపూలే, అంబేడ్కర్‌ల కృషి ఫలితంగానే అందరికీ చదువు, సమాన హక్కులు కల్పించారన్నారు.

అద్దెకు పీఏసీఎస్ భవనాలు

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం వెల్దుర్తిలో పీఏసీఎస్ నిర్మించిన దుకాణ సముదాయాలు ఈ నెల 5న వేలంపాట ద్వారా అద్దెకు ఇవ్వనున్నట్లు సొసైటీ సీఈఓ సిద్ధయ్య పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 5వ తేదీ ఉదయం 10:30 నుంచి 01:00 గంటల వరకు రూ.10వేలు ధరావత్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఏదైన దుకాణానికి ఎక్కువ మంది ఆసక్తి చూపినట్లయితే వేలంలో అధికంగా డబ్బులు వెచ్చించే వారికి అద్దెకు ఇస్తామన్నారు.

కమ్ముకున్న కారు మబ్బులు



టేక్మాల్(మెదక్): ఆకాశంలో నల్లని మబ్బులు కమ్ముతున్నాయి. రైతన్న వర్షపు చినుకుల కోసం ఆశగా ఆకాశం వైపు చూస్తున్నాడు. ఈ మనోహర సన్నివేశం టేక్మాల్ మండలం కాద్లూర్ శివారులోని కనిపించగా.. ఈ దృశ్యాలను ఆదివారం సాక్షి తన కెమెరాలో బంధించింది.

విద్యార్థినులకు కరాటేలో శిక్షణ



శిబిరంలో పాల్గొన్న విద్యార్థినులు

రామాయంపేట(మెదక్): రామాయంపేట, నిజాంపేట, నార్సింగి మండలాలకు చెందిన విద్యార్థినులకు ఆదివారం బాలికల ఉన్నత పాఠశాలలో కరాటే శిబిరం నిర్వహించారు. ఆపత్కర సమయంలో విద్యార్థినులు తమను తాము ఎలా రక్షించుకోవాలన్నది శిక్షణ మేలకువలు నేర్పించారు. నేటి పరిస్థితిలో విద్యార్థినులు ఆత్మరక్షణ కోసం శిక్షణ పొందాల్సిన అవసరం ఉందని గ్రాండ్ మాస్టర్ హరిప్రసాద్ సూచించారు. మూడు మండలాలకు చెందిన 70 మంది వరకు విద్యార్థినులు పాల్గొన్నారు. కార్యక్రమంలో బెల్ట్ మాస్టర్లు సంపత్‌కుమార్, నాగరాజు పాల్గొన్నారు.